# యూఏపీఏ చట్టం పరిధిలోకి 23 మంది పాక్ ఉగ్రవాదులు

-- కేంద్ర హోంశాఖ




**న్యూఢిల్లీ,న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** పాకిస్థాన్‌కు చెందిన 23 మందిని.. యూఏపీఏ చట్టం కింద ఉగ్రవాదుల జాబితాలో ప్రభుత్వం చేర్చింది. దీనిపై కేంద్ర హోంశాఖ ప్రకటన చేసింది. జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా, జమాత్ ఉద్ దవా, ద రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థలకు చెందిన ఉగ్రవాదులు ఆ 23 మందిలో ఉన్నారు. యూఏపీఏ సెక్షన్ 35 కింద ఆ 23 మందిని ఉగ్రవాదులుగా తేల్చింది. రిక్రూట్మెంట్, ట్రైనింగ్, చొరబట్లు, లాజిస్టిక్స్ మద్దతతో ఆయుధాలు, డ్రోన్ ఆధారిత వెపన్స్ సరఫరా చేస్తున్నట్లు ఆ ఉగ్రవాదులపై ఆరోపణలు ఉన్నాయి. భారత్‌పై దాడులకు కూడా వాళ్లు ప్లాన్ వేసినట్లు తెలిసింది. యూఏపీఏ జాబితాలో చేరడం వల్ల ఆ ఉగ్రవాదులకు నిధులను ఎన్ఐఏ అడ్డుకుంటుంది. 2019లో యూఏపీఏ చట్టాన్ని సవరణ చేశారు. అంతకుముందు కేవలం ఉగ్ర సంస్థలను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచేవారు. ఇప్పుడు ఉగ్రవాదులను వ్యక్తిగతంగా కూడా అడ్డుకుంటున్నారు. 23 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు ఇటీవల జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలపై జరిగిన దాడులకు కారణమయ్యారు. అయితే యూఏపీఏ జాబితాలో ఉగ్రవాదుల సంఖ్య ఇప్పుడు 80కి చేరింది.

# స్కూల్‌లో బర్త్‌డే చాక్లెట్లు తిని 21 మంది విద్యార్థులకు అస్వస్థత



**చెన్నై,న్యూఢిల్లీ,జూన్ 4(మహాప్రభ):** పుట్టిన రోజు వేడుకల్లో విషాదం జరిగింది. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో.. ఓ స్కూల్ విద్యార్థిని తన పుట్టిన రోజు సందర్భంగా క్లాస్‌మేట్స్‌కు చాక్లెట్లు పంచి పెట్టింది. అయితే ఆ చాక్లెట్లు తిన్న తోటి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సుమారు 21 మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. చక్కరపురంలో ఉన్న పంచాయ్ యూనియన్ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. ఆరవ తరగతి స్టూడెంట్ తన పుట్టిన రోజు సందర్భంగా క్లాస్‌మేట్సకు చాక్లెట్లు పంచింది. ఆ చాక్లెట్లు తిన్న తర్వాత విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. కొందరు సొమ్మసిల్లిపోయారు. చాక్లెట్లు తిన్న వెంటనే 11 మంది అమ్మాయిలు, 10 మంది అబ్బాయిలు అస్వస్థతకు గురయ్యారు. అయితే ఆ స్కూల్ టీచర్లు వెంటనే విద్యార్థులను గింజి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు అక్కడ చికిత్స జరుగుతోంది. చీఫ్ మెడికల్ ఆఫీసర్ బాలా గోపాల్ ఆధ్వర్యంలో చికిత్స జరుగుతోంది. ఈ ఘటన పట్ల దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వర్క్ ఫ్రం హోమ్ ఎత్తివేస్తూ ఢిల్లీ సీఎం ఆదేశాలు



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** పశ్చిమాసియా ఉద్రికత్తల నేపథ్యంలో ఇంధన సరఫరా మందగించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం మళ్లీ పరిస్థితులు మెరుగుపడుతున్న నేపథ్యంలో.. ఢిల్లీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. గతంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రకటించిన వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆఫీసు పనివేళల్లో కూడా మార్పులు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వారానికి రెండు సార్లు ఇంటి నుంచి పని చేయాలని మే నెలలో సీఎం రేఖా గుప్తా ఆదేశించారు. ఇంధనాన్ని ఆదా చేయాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఆ చర్యలు తీసుకున్నారు.ప్రస్తుతం పరిస్థితి సాధారణ స్థాయికి వచ్చిందని, దీంతో వర్క్ ఫ్రమ్ హోం ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీఎం కార్యాలయం పేర్కొన్నది. బుధవారం, శనివారం రోజుల్లో వర్క్ ఫ్రం హోం కోసం ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఆ నియమాన్ని ఎత్తివేసింది. ఇక ఆఫీసు వేళలను కూడా మార్చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిగంటలుగా ప్రకటించారు. గతంలో 10.30 నుంచి ఏడు గంటల వరకు ఉండేది. వర్క్ ఫ్రం హోం పాలసీ మార్పులకు చెందిన పూర్తి సమాచారం ఇంకా వెల్లడి కావాల్సి ఉన్నది.ం

# బలోచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి..

## 30 మంది పాక్ జవాన్లు మృతి



**హైదరాబాద్:జూన్ 4(మహాప్రభ):** బలోచిస్థాన్‌లోని జివానీలో గల పాకిస్థాన్ కోస్ట్ గార్డ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపినట్టు ప్రకటించింది. ఈ ఘటనలో 30 మంది పాక్ జవాన్లు మరణించినట్టు పేర్కొంది. తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారని బీఎల్ఏ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అయితే ఈ దాడి, మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తమకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యం లో తరచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాదసంస్థగా ప్రకటించింది.

# మమతా బెనర్జీకి మరో షాక్..

**పార్టీకి రాజీనామా చేసిన బెంగాల్ టీఎంసీ అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య**



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి మరో షాక్ తగిలింది. మమతకు అత్యంత సన్నిహితురాలు, పశ్చిమ బెంగాల్ టీఎంసీ అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య టీఎంసీకి రాజీనామా చేశారు. పార్టీకి చెందిన అన్ని పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఇకపై పార్టీకి పూర్తి దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రాజీనామా చేయడం అంటే ఆ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలినట్లే.ఎంసీకి చెందిన అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నట్లు, కాలిఘాట్‌లో మమతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చంద్రిమ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. టీఎంసీకి చెందిన వివిధ బ్యాంకు అకౌంట్లకు సంబంధించి బాధ్యతల నుంచి కూడా తప్పుకొంటున్నట్లు, అలాగే, తన సంతకాన్ని కూడా వాటి నుంచి తొలగిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇకపై, పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీల విషయంలో ఆమె సంతకం చెల్లదు. పార్టీకి సంబంధించిన అంశాల్లో తన పేరును ప్రస్తావించకూడదని, మమత తరఫున తనను సంప్రదించకూడదని కూడా చంద్రిమ.. ఎన్నికల సంఘాన్ని కోరింది. అయితే, తన రాజీనామాకు గల కారణాన్ని చంద్రిమ వెల్లడించలేదు. ఉన్నట్లుండి ఆమె తన పదవులకు రాజీనామా చేయడం బెంగాల్ రాజకీయాల్లో? సంచలనంగా మారింది. మరోవైపు చంద్రిమ రాజీనామాపై టీఎంసీ కూడా స్పందించలేదు. ఇప్పటికే టీఎంసీకి అనేక మంది కీలక నేతలు రాజీనామా చేశారు. మరోవైపు అటు ఎంపీలు, ఇటు ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రత బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయనకు అసెంబ్లీలో టీఎంసీ తరఫున ప్రతిపక్ష నేతగా గుర్తింపు దక్కింది. తిరుగుబాటు అంశం ప్రస్తుతం ఎన్నికల సంఘం పరిశీలనలో ఉంది. మమతా బెనర్జీ వర్గానికి, రితబ్రత వర్గానికి ఈసీ నోటీసులు జారీ చేసింది. వారి స్పందన తర్వాత ఈసీ నిర్ణయం తీసుకోనుంది.

# డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ కలపనున్న కేంద్రం

**ఈ20 పెట్రోల్ తర్వాత డీజిల్ వంతు..**




**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** ఒకపక్క దేశంలో ఈ20 పెట్రోల్‌పై చర్చ జరుగుతుండగానే కేంద్రం మరో కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించాలని, ఆధునిక స్వచ్ఛమైన చమురును వాడాలనే కేంద్ర లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గడ్కరీ వెల్లడించారు. చమురు దిగుమతుల్ని తగ్గించేందుకు కేంద్రం ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే.దీనిలో భాగంగా ఇప్పటికే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. అయితే, పెట్రోల్‌లో కలిపినట్లుగా ఇథనాల్‌ను డీజిల్‌లో నేరుగా కలపడానికి వీలుకాదు. అందువల్ల ఇథనాల్ నుంచి ఐసోబ్యూటనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. దీన్ని డీజిల్‌లో కలుపుతారు. త్వరలో డీజిల్‌లో ఐసోబ్యూటనాల్‌ను 15 శాతం కలపబోతున్నారు. అంటే, ఇకపై పూర్తి డీజిల్ కాకుండా.. 85 శాతం డీజిల్, 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపిన చమురు అందుబాటులోకి వస్తుంది. ఇంకా చెప్పాలంటే ఐసోబ్యూటనాల్‌ను డీజిల్‌కు పూర్తి ప్రత్యామ్నాయంగా కూడా వాడుకోవచ్చని గడ్కరీ అన్నారు. ప్రస్తుతం ఐసోబ్యూటనాల్ మిక్సింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, దేశీయ చమురు భద్రతలో ఇదో కీలక ముందడుగు అని గడ్కరీ అభివర్ణించారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రస్తుతం దీన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు జనరేటర్లను ఇలా విజయవంతంగా వాడినట్లు చెప్పారు. డీజిల్‌లో ఐసోబ్యూటనాల్ కలపడం వల్ల డీజిల్ వినియోగం తగ్గుతుందని, దీనివల్ల విదేశాల నుంచి క్రూడాయిల్ దిగుమతులు తగ్గుతాయన్నారు. ఇటీవలి కాలంలో పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతూ కేంద్రం చేపట్టిన చర్యల వల్ల రూ.1.9 లక్షల కోట్ల విదేశీ మారక నిధులు మిగిలాయిన నితిన్ గడ్కరీ వెల్లడించారు. దీనివల్ల కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయన్నారు. అయితే, కేంద్ర నిర్ణయంపై ప్రజల నుంచి, నిపుణుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గుతుందని, త్వరగా పాడయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కేంద్రం నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# ఖమేని అంత్యక్రియల కోసం ఇరాన్‌కు వీకాఫ్ ఇచ్చాం.. మేం మంచోళ్లం



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** ప్రస్తుతం ఇరాన్‌లో ఆ దేశ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేని, అతడి కుటుంబ సభ్యుల అంత్యక్రియలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖమేని అంత్యక్రియల కోసం ఇరాన్‌కు వీకాఫ్ ఇచ్చాం అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. మౌంట్ రష్‌మోర్‌లో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. ఇరాన్‌లో ఖమేని అంత్యక్రియలు వారం రోజులపాటు జరగనున్నాయి. ఇప్పటికే కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ అంశంపై ట్రంప్ తాజా సమావేశంలో మాట్లాడారు.ఇరాన్ ప్రజలు వారం రోజులపాటు అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు వీకాఫ్ ఇచ్చామన్నారు. ఎందుకంటే మనం మంచివాళ్లం అంటూ అక్కడి అమెరికన్లతో వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై అమెరికా విజయం సాధించిందన్నారు. "మనం ఇరాన్‌ను దారుణంగా ఓడించాం. యుద్ధం కారణంగా ఇరాన్ దారుణంగా నష్టపోయింది. వారు దీన్నుంచి కోలుకోవడానికి కష్టపడుతున్నారు. మనం చాలా మంచి వాళ్లం కాబట్టి ఖమేని అంత్యక్రియల కోసం ఇరాన్‌కు వీకాఫ్ ఇచ్చాం. అమెరికాలో ఉన్న అతివాదులు, ఉగ్రవాదుల వల్ల దేశ సమగ్రతకే ముప్పు పొంచి ఉంది. అమెరికాకు స్వతంత్రం లభించి 250 ఏళ్లవుతున్న తరుణంలో అమెరికా గుర్తింపుపై దాడి జరుగుతోంది. కమ్యూనిస్టుల నుంచి మన దేశానికి మళ్లీ ప్రమాదం పొంచి ఉంది. మనలో ఉన్న ప్రత్యేక లక్షణాన్ని మార్చడానికి, అమెరికన్ల స్ఫూర్తిని దెబ్బతీయడానికి, చరిత్రను మన నుంచి దూరం చేయడానికి కొన్నేళ్లుగా తీవ్రమైన ప్రయత్నం జరుగుతోంది" అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇరాన్‌తో యుద్ధంతోపాటు ఆయన ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలకు వ్యతిరేకంగా తీర్పులు వెలువడిన తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇరాన్‌పై దాడులు కొనసాగించిన అమెరికా ఇప్పుడు కాస్త విరామం ఇచ్చింది. ఖమేని అంత్యక్రియల నేపథ్యంలో ఇరు దేశాలు ఎలాంటి పరస్పర దాడులకు దిగడం లేదు. గత ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికా జరిపిన దాడిలో ఖమేని మరణించాడు. ఇంతకాలానికి యుద్ధం ముగింపు దశకు చేరడంతో ఆయన అంత్యక్రియల్ని ఇరాన్ నిర్వహిస్తోంది.

# ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు ఎదురుదెబ్బ..

**- బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన కోర్టు**



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):** ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టై జైలులో ఉన్న కీలక నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ కోసం వారు దరఖాస్తు చేసుకున్న పిటిషన్లను కర్కార్‌దూమా కోర్టు తిరస్కరించింది. నిందితులు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత బెయిల్ తిరస్కరణకు గురికావడం ఇది రెండోసారి. ఇంతకుముందు గత జనవరి 5న ఇద్దరి బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ అంశంలో ట్రయల్ కోర్టుకే వెళ్లాలని సుప్రీం కోర్టు సూచించింది. ఈ సందర్భంగా నిందితులపై యుఏపీఏ చట్టం కింద కేసు ఉన్నప్పటికీ బెయిల్ పొందే అవకాశం ఉందని చెప్పింది.దీంతో నిందితులు ఈస్ట్ ఢిల్లీలోని కర్కర్‌దూమా ట్రయల్ కోర్టును మరోసారి బెయిల్ కోసం ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చి ఆరు నెలలు గడిచినా కూడా తమ కేసు విచారణ ముందుకు సాగడం లేదని బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ ఆలస్యమవుతోందని, ఇప్పటికే ఈ కేసులో తాము ఆరేళ్లుగా జైలులో ఉంటున్నామని ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లు కోర్టుకు తెలిపారు. విచారణ ముందుకు సాగకుండా తమను దీర్ఘకాలంపాటు జైలులో నిర్బంధించం అంటే తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినట్లే అని, అందువల్ల తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై శనివారం అడిషనల్ సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్ విచారణ జరిపారు. బెయిల్ పిటిషన్లను తిరస్కరించారు. ఇవి విచారించదగినవి కావన్నారు. 2020, ఫిబ్రవరిలో ఢిల్లీలో అల్లర్లు జరిగాయి. కేంద్రం తీసుకొచ్చిన చట్టాలైన సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ అల్లర్లలో 53 మంది మరణించగా, 700 మంది గాయపడ్డారు. దీంతో ఈ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ ఇద్దరూ జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేతలు. ఢిల్లీ అల్లర్లకు వీరు కుట్ర పన్నారని ఆరోపిస్తూ యూఏపీఏ చట్టం కింద అదుపులోకి తీసుకున్నారు. దాదాపు ఆరేళ్లుగా జైలులోనే ఉంటున్నారు.

## అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

మొదటి తరువాయి

కాంప్లెక్స్‌ను ప్రధాని నరేంద్ర మోడీ శనివారం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రిఫైనరీ కాంప్లెక్స్‌ను పరిశీలించిన ఆయన, రిమోట్ బటన్ నొక్కి ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన కొరతతో తీవ్ర ఇబ్బందులు వేసి సరైన వ్యూహంతో ముందుకువెళ్లిందని తెలిపారు.

రూ.75 వేల కోట్లకు పైగా నష్టాలు!

సంక్షోభానికి ముందు భారత్ సుమారు 25 నుంచి 26 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేదని మోడీ చెప్పారు. పరిస్థితులు మారిన తర్వాత దిగుమతుల కోసం 40కి పైగా దేశాలతో సంబంధాలను విస్తరించినట్లు తెలిపారు. భారత దౌత్య బలాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఇంధన సంక్షోభం నుంచి దేశాన్ని బయటపడేశామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య మూడు నెలల సంఖ్యలోనే రూ.75 వేల కోట్లకు పైగా నష్టాలను ఎదుర్కొన్నామని ప్రధాని వెల్లడించారు. అయినప్పటికీ ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై మోపకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. లీటర్‌పై రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి సామాన్యులపై అదనపు భారం పడకుండా చూశామని వివరించారు.

ఇంధన సంక్షోభ సమయంలో భారత్ విఫలమవుతుందని కొందరు భావించారని మోడీ విమర్శించారు. దేశంలో అనేక రకాల వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. భారత్ విఫలమవుతుందని అంచనాలు వేసిన వారు ఇప్పుడు నిరాశలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా భారత్ అవతరించిందని ప్రధాని తెలిపారు. ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకువెళ్తోందని చెప్పారు. స్వాభిమానం నిలవాలంటే వ్యక్తి అయినా, దేశమైనా స్వావలంబన సాధించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

## కవిత టీఆర్ఎస్‌కి ఈసీ షాక్..

మొదటి తరువాయి


స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇవ్వమని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికి సిద్ధమని కవిత స్పష్టం చేశారు.

కాగా, తెలంగాణ రాజకీయాల్లో, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ అంశంలో ట్విస్టుల మీద ట్విస్టులు నమోదవుతున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన (టీ ఆర్ ఎస్)' పేరుతో ప్రజల్లోకి వెళ్తున్న కవితకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా బిగ్ షాక్ ఇవ్వడం, తన పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన' గా నామకరణం చేస్తూ రిజిస్ట్రేషన్ కోసం కవిత ఈసీకి దరఖాస్తు చేసుకోగా ఈ పేరుపై సుమారు వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని అందువల్ల మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సర్పించాలని ఈసీ తాజాగా కవితకు లేఖ రాసింది. ఈ మేరకు జూన్ 23న కవితకు ఈసీ పోస్టు ద్వారా లేఖను పంపించినట్లు సమాచారం. ఈసీ నుంచి వచ్చిన 2 అభ్యంతరాలకు కల్వకుంట్ల కవిత స్పందిస్తూ సమాధానం ఇచ్చారు. అయితే ఈసీ కోరుతున్న ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఈ విషయంలో న్యాయపోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు కవిత తెలిపారు. అయితే టీఆర్ఎస్ ను విభేదించిన కవిత సొంత పార్టీని స్థాపించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న వేళ పార్టీ విషయంలో ఎదురవుతున్న చిక్కులు కవిత రాజకీయ భవిష్యత్‌పై చర్చకు దారి తీస్తోంది.

నిజానికి గత ఫిబ్రవరిలో తెలంగాణ జాగృతి, తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి అనే ఐదు పేర్లను సూచిస్తూ కవిత ఈసీకి లేఖ రాశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 25న మునీరాబాద్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో తమ పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన అని కవిత అనౌన్స్ చేసి జెండాను సైతం ఆవిష్కరించారు. ఆ తర్వాత మూడు రోజులకు ఏప్రిల్ 28న కవిత కొత్త పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా ప్రాథమికంగా గుర్తిస్తూ నెల రోజుల్లోగా అభ్యంతరాలు కోరుతూ పత్ర కల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. అయితే కేవలం మూడు రోజుల వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ కాస్త తెలంగాణ రక్షణ సేనగా మారడం పెద్ద ఎత్తున చర్చగా మారింది. అయితే తెలంగాణ రక్షణ సేన పేరుతోనే కవిత పోరాటాలు చేస్తున్న క్రమంలో ఈసీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం ప్రత్యామ్నాయ పేరు ఎంపిక చేసుకోవాలని సూచించడంతో ఈ పరిణామాలు కవిత పొలిటికల్ కెరీర్ పై ఎలాంటి ప్రభావం చూపబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.

## టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు


- పైరసీ కంటెంట్‌పై 15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఛానళ్లు, గ్రూపులపై ఉక్కుపాదం
- స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఇప్పటికే 3 వేలకుపైగా పైరసీ ఛానళ్లపై కేంద్రం చర్యలు
- సినిమా, ఓటీటీ పరిశ్రమ ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం



**న్యూఢిల్లీ:**
టెలిగ్రామ్ వేదికగా పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్, ఇతర ఆడియో--విజువల్ మెటీరియల్ అక్రమంగా వ్యాప్తి చెందడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ టెలిగ్రామ్‌కు శనివారం నోటీసులు జారీ చేసింది.నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఛానళ్లు, గ్రూపులపై 15 రోజుల్లోగా కఠిన చర్యలు తీసుకుని పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. గతంలో కూడా పైరసీ కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న మూడు వేలకుపైగా టెలిగ్రామ్ ఛానళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాపీరైట్ చట్టం--1957, సినిమాటోగ్రాఫ్ చట్టం--1952 ప్రకారం కాపీరైట్ ఉల్లంఘన క్రిమినల్ నేరమని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చట్టపరమైన చర్యలు తప్పవని టెలిగ్రామ్‌ను హెచ్చరించింది. దేశంలోని సృజనాత్మక రంగం, సినిమా పరిశ్రమ, ఓటీటీ వేదికలు, నిర్మాతలు, పంపిణీదారుల ప్రయోజనాలను కాపాడేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## మోదీని చంపేస్తామంటూ వార్నింగ్

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు సోషల్ మీడియాలో బెదిరింపు
- 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పోస్టుకు అభ్యంతరకర కామెంట్
- 'స్టేడియం పైకప్పు మూసి ఉంటే బెటర్' అంటూ హెచ్చరిక
- ఐపీ అడ్రస్ గుర్తించిన మెల్‌బోర్న్ పోలీసులు.. విచారణ ముమ్మరం
- ప్రధాని భద్రతపై అప్రమత్తమైన ఆస్ట్రేలియా భద్రతా సంస్థలు



**సిడ్నీ**
ప్రధాని నరేంద్ర మోదీని చంపేస్తామంటూ వార్నింగ్ రావడం కలకలం రేపుతున్నది. జూలై 9న ప్రధాని మోదీ ఆస్ట్రేలియాలో 3 రోజుల పాటు పర్యటించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్‌లో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే పోస్టుతో ప్రమోషన్ చేస్తున్నారు.ఈ పోస్టు కింద అబు ముస్తఫా అనే ఐడీ నుంచి ఓ బెదిరింపు కామెంట్ వచ్చింది. 'స్టేడియం పైకప్పు మూసి ఉంటే బెటర్. లేదంటే అతను తన చావు కోసమే ఆస్ట్రేలియా వస్తాడు' అని ఆ కామెంట్‌లో ఉంది. దీనిపై మెల్‌బోర్న్ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే పోలీసులు ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్టు తెలుస్తున్నది.

## ట్రంప్‌నకు అమెరికా కోర్టు షాక్


మొదటి తరువాయి

పరిగణించి, వారి డిపోర్టేషన్ కేసులు పూర్తయ్యే వరకు బెయిల్ అవకాశం లేకుండా తప్పనిసరి నిర్బంధంలో ఉంచే విధానాన్ని అక్కడి యంత్రాంగం అమలు చేస్తోంది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ ఇద్దరు మెక్సికో పౌరులు, ఒక హోండురాస్ పౌరుడు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యూ ఆర్లియన్స్ కేంద్రంగా పనిచేసే ఐదో సర్క్యూట్ అప్పీల్ కోర్టు 2-1 మెజారిటీతో కీలక తీర్పు వెలువరించింది.

ఈ తీర్పు ప్రకారం.. వలసదారులను 90 రోజులకు మించి నిర్బంధించాలంటే వారికి ఇమ్మిగ్రేషన్ న్యాయమూర్తి ఎదుట హాజరై బెయిల్‌పై విడుదల కోరే అవకాశం ఇవ్వాల్సిందే. ఎలాంటి విచారణా లేకుండా నిరవధికంగా నిర్బంధించడం అమెరికా రాజ్యాంగంలోని ఐదో సవరణ కల్పించిన న్యాయ ప్రక్రియ హక్కులకు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. అయితే ట్రంప్ నియమించిన న్యాయమూర్తి కోరీ విల్సన్ ఈ తీర్పుతో విభేదించారు. వలస అంశాలపై నిర్ణయాధికారం ప్రధానంగా అమెరికా కాంగ్రెస్‌కే ఉందని, కోర్టు ఆ అధికార పరిధిని తగ్గిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. వలసదారుల తరఫున వాదించిన అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ న్యాయవాది రెబెక్కా క్యాస్లర్ ఈ తీర్పును స్వాగతించారు. ప్రభుత్వం ఎవరినీ నిరవధికంగా నిర్బంధించే అధికారం లేదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆమె వివరించారు. మరోవైపు అమెరికా అంతర్గత భద్రతా శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ) మాత్రం ఈ తీర్పుతో విభేదించింది. తప్పనిసరి నిర్బంధంపై తమ న్యాయపరమైన వాదన బలంగా ఉందని, ఈ అంశంపై తుది నిర్ణయం కోసం ఇప్పటికే అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించామని వెల్లడించింది.?

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- ఆగస్టు 13 వరకు జరిగేలా తేదీలు ఖరారు చేసిన కేంద్రం
- అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశాభావం
- మొత్తం 19 రోజులపాటు ఉభయసభల సమావేశాలు
- ప్రభుత్వ సిఫార్సుకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు ఉభయసభల సమావేశాలు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు. వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. జులై 20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బెంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువ సభలో బీజేపీ మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్ట్ అయి వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. ఈ నిబంధనపై ఇప్పటికే తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నత పదవుల్లో ఉన్నవారి జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ నిబంధన ఉపయోగపడుతుందని బిల్లుకు మద్దతు ఇస్తున్నవారు చెబుతున్నారు. అయితే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దీనిని ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను అరెస్టు చేయడం ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివాదాస్పద నిబంధనను పూర్తిగా తొలగించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే రాజకీయ కక్ష సాధింపు చర్యలు, ఉద్దేశపూర్వక కేసుల నుంచి రక్షణ కల్పించేలా కొన్ని భద్రతా చర్యలను జేపీసీ తన నివేదికలో సూచించే అవకాశం ఉన్నట్లు సమాచారం. జూలై 17న జరిగే సమావేశంలో నివేదికకు తుది రూపం ఇచ్చి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఎదురైన పరిణామాల నేపథ్యంలో అధికార ఎన్డీయే ఈసారి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు గత సమావేశాల్లో దిగువ సభలో ఆమోదం పొందలేదు. దీంతో బిల్లులో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే విధంగా 50 శాతం పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం కీలకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారత సైనికుల ప్రాణనష్టానికి సంబంధించిన అంశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌ను వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షం ప్రస్తావించే అవకాశం ఉంది.

## కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదు..

మొదటి తరువాయి

మంది నన్ను అవహేళన చేశారని సీఎం మండిపడ్డారు. దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చు కానీ పేదల మధ్య పెరిగిన నాకు సమస్యలు తెలియదా? కుట్టనిది, ముట్టనిది మనమే బిడ్డలు కావాలి కానీ పరిపాలనకు పాలమూరు బిడ్డ పనికిరాడా? ఇలాంటి దురహంకారాన్ని బొంద పెట్టాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపైనే ఉందన్నారు. అహంకారానికి కూడా ఓ హద్దు ఉంటుందన్నారు. అహంకారం, అహంభావం పేట్రేగిపోయి గద్దెరుస్సును గద్దె ముంద నాలుగు గంటలు ఎర్రటి ఎండలో కుర్చోబెట్టిన వ్యక్తిని మనం క్షమించాలా? గద్దె ను ఎండ లో నిలబెట్టిన కేసీఆర్ ను ఉరేసినా తప్పులేదన్నారు. ప్రజాపాలన పోవాలని, పాపాల భైరవుడు మళ్లీ రావాలని కేసీఆర్ కొడుకు కేటీఆర్, ఆయన అల్లుడు హరీశ్ రావు గద్దెల్లా ఉర్లమీద పడి అంటున్నారని సీఎం మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో తప్పులను, అన్యాయాలను ప్రజలు క్షమించారు. కానీ రాష్ట్రం వచ్చాక పదేళ్లలో చేసిందేంటి? ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన దళితులను లారీలతో తొక్కించారు. పంటలకు గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మంలో రైతులకు బేడీలు వేశారు. ప్రశ్నపత్రాలను పబ్లిక్ రాళ్లల్లో అమ్ముకున్నారు. రేషన్ కార్డులు ఇచ్చినందుకు, సన్న బియ్యం ఇచ్చినందుకా? ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకా ఎందుకు ప్రజా పాలన పోవాలని నిలదీశారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టాలన్నారు.

మిడ్జిల్ నాటిన మొక్క.. నేడు మహా వృక్షమైంది : సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగం

2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు జడ్పీటీసీగా తనను ఆశీర్వదించారని ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా మాట్లాడుతూ.. జడ్పీటీసీగా సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించిన రోజు 2006 జులై 4 అని గుర్తుచేశారు. ఆరోజే అది నా గెలుపు కాదని.. అది మిడ్జిల్ ప్రజల గెలుపు అన్నారు. జడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని నాది ఈ నియోజకవర్గం కాకపోయినా ఇక్కడి ప్రజలు నమ్మకంతో గెలిపించారన్నారు. ఆనాడు మీరు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారన్నారు. తనను అక్కున చేర్చుకున్న మిడ్జిల్ మండలం రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. అందువల్లే ఈ మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి సంక్షేమ పనులను సమన్వయం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కును ఆదేశించారు. ఇది డార్క్ మండలం కాదని ఈ ప్రాంత ప్రజలకు వెలుగు రేఖలు వచ్చాయని ప్రభుత్వ లేఖల్లో తేలాలని సూచన చేశారు. తన 20 ఏళ్ల ప్రజాజీవితంలో ఏ ఒక్కరోజు సెలవు తీసుకోలేదని ప్రతిపక్షంలో ఉంటే ప్రజాసమస్యలపై పోరాటం చేశాను. అధికారంలో సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించానన్నారు. అలాగే దీర్ఘకాలికంగా పట్టి పీడిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించానన్నారు. 40 ఏళ్ల వర్గీకరణ అనే రావణాకాష్టాన్ని తనకు అవకాశం వచ్చిన వెంటనే పరిష్కారం చూపించానన్నారు. అలాగే 100 ఏళ్ల బీసీ సమస్యకు జనగణనతో పరిష్కారం చూపించానన్నారు.

అనుభవం లేదని నన్ను చాలా మంది అవహేళన చేశారని గ్రామీణ ప్రాంతానికి చెందిన నన్ను అన్ని కులాలు, మతాలు, అక్కున చేర్చుకున్నారన్నారు పేదల సమస్యలు చూసుకుంటూ పెరిగాను. వ్యవసాయం తెలుసు. భూమికి, విత్తనానికి ఉన్న బంధం ఏంటో పరిపాలన చేసే వాడికి ఉండాల్సిన అవగాహనతోనే గ్రామంలో పెరిగినన్నారు. గ్రామీణ సమస్యలు గడీల్లో ఉన్న దొరలకు తెలియకపోవచ్చు. కానీ గ్రామంలోని సమస్యలు పరిష్కారం అయితేనే రాష్ట్ర సమస్యలు పరిష్కారం అయినట్లు ఉన్నారు. పాలమూరు ప్రజలు పరిపాలనకు పనికిరారా? తట్టపనికి, పార, పలుగు పనికి పాలమూరు బిడ్డ కావాలి కానీ పరిపాలనకు మాత్రం పాలమూరు బిడ్డ వద్దనే దురహంకారాన్ని బొందపెట్టాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉంది " అని ఆ న్నారు. అహంకారానికి కూడా ఓ హద్దు ఉంటుంది. అహంకారం, అహంభావం పేట్రేగిపోయి గద్దెరుస్సును గడీల ముందు నాలుగు గంటలు ఎర్రటి ఎండలో కుర్చోబెట్టిన వ్యక్తిని మనం క్షమించాలా? గద్దెరెను ఎండలో నిలబెట్టిన కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదన్నారు. నా వల్ల ఎవరికీ కష్టం నష్టం రావొద్దనేదే నా ఆలోచన. ఆనాడు నాపై జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి రబ్బాణీకి ఈనాటి ప్రభుత్వంలో ఏదో ఒక మంచి బాధ్యత ఇస్తామన్నారు. ఈ మేరకు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పార్టీ నేతలను ఆదేశించారు.

## రేవంత్ రెడ్డి చేస్తున్నది నిజమైన ప్రజాపాలన

మొదటి తరువాయి

స్వయంగా చూసి, వాటిని పరిష్కరించే నాయకుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమ బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. సాధారణంగా ముఖ్యమంత్రి పర్యటనలంటే భద్రతా వలయాలు, అధికారుల హడావుడి మాత్రమే కనిపిస్తాయి. కానీ, రేవంత్ రెడ్డి ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, తన రాజకీయ పునాదికి కారణమైన కార్యకర్తలు, మిత్రులతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. "నేను అలసిపోయినా పర్వాలేదు, నా పదవికి పునాది వేసిన వారితో కలిసి భోజనం చేయాలి" అన్న రేవంత్ సంకల్పం ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని భట్టి కొనియాడారు. సభ జరుగుతున్న వేళ కురిసిన వర్షపు జల్లులు ప్రకృతి రేవంత్ రెడ్డిని ఆశీర్వదిస్తున్నట్లుగా ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. "మంచి సంకల్పంతో మానవ సేవే మాధవ సేవగా ముందుకు సాగుతుంటే, ప్రకృతి సైతం సహకరిస్తుంది. ఈ వర్షం అందుకు సంకేతం" అని ఆయన అభివర్ణించారు. "ఏ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చామో, ఏ రైతు కష్టాలు, ఏ నిరుపేదల ఆకలి బాధలను స్వయంగా చూశాడో.. వాటినే కేంద్రంగా చేసుకుని ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారు" అని భట్టి వివరించారు. అధికారులు ఇచ్చే రొటీన్ రిపోర్టులకు లోబడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించడమే రేవంత్ రెడ్డి విజన్ అని ఆయన స్పష్టం చేశారు. "రాష్ట్రంలోని 1.15 కోట్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు సంతోషంతో కడుపు నిండా భోజనం చేయాలనేదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం. గోళ్లు వాళ్లే తినే సన్నబియ్యం పేదవాడికి ఎందుకు అందకూడదనే ఆయన ఆలోచన, సామాన్యుడిని గౌరవించే పాలనకు నిదర్శనం" అని భట్టి పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 27 లక్షల మంది విద్యార్థులు అర్ధాకలితో బడికి వెళ్లకూడదని, వారికి పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, గ్లాసు పాలు, గుడ్డు అందించాలనే నిర్ణయం వెనుక.. ఆకలి బాధను స్వయంగా తెలిసిన నాయకుడి గొప్ప మనసు ఉందని ఆయన కొనియాడారు. అక్కాచెల్లెమ్మల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని భట్టి ప్రశంసించారు. "ఏడాదికి 20 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. గతంలో మోసపోయిన మహిళలకు భరోసా కల్పిస్తూ, వారి కుటుంబాల్లో వెలుగులు నింపడమే ఈ ప్రభుత్వ లక్ష్యం" అని వివరించారు. ఐదేళ్ల పాలనలో పేదవాడికి ఇల్లు ఇవ్వకుండా మోసం చేసిన గత ప్రభుత్వానికి భిన్నంగా, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని భట్టి అన్నారు. పేదవాడికి సొంత గూడు కల్పించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలనేదే రేవంత్ రెడ్డి పాలనా విధానమని ఆయన చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగినా, ఆనాడు తనను దీవించిన ప్రజలను మర్చిపోకుండా తిరిగి వచ్చి కృతజ్ఞతలు చెప్పే రేవంత్ రెడ్డి గారి సంస్కారమే ఆయనను గొప్ప నాయకుడిగా నిలబెడుతుందని, ప్రజల గుండెల్లో ఆయనకు శాశ్వత స్థానాన్ని కల్పిస్తుందని అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో నెలకొన్న అభద్రతా భావాన్ని ప్రస్తావిస్తూ.. నేడు ఆ భయం పోయిందని భట్టి పేర్కొన్నారు. "ఒకప్పుడు ప్రజలు, ఉద్యోగులు, అధికారులు బిక్కుబిక్కుమంటూ బతికారు. కానీ, నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకునే ప్రజాస్వామ్య వాతావరణాన్ని తెలంగాణలో పునరుద్ధరించాం" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## రైతు భరోసాలో రేవంత్ ప్రభుత్వం రికార్డు

మొదటి తరువాయి

ఐదో విడతలో 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రూ.545.41 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.69 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం పొందారని తెలిపారు. ఇప్పటికే తొలి నాలుగు విడతలో 4 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేశామని, 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులందరికీ సాయం అందించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## మహారాష్ట్రను ముంచెత్తుతున్న వానలు

మొదటి తరువాయి

దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, వర్షాల తీవ్రత అంచనాలకు మించి ఉందని, ఈ పరిస్థితి ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగే అవకాశముందని తెలిపారు. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైలు సర్వీసులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరగా, జాతీయ రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముంబై, థానే, పాల్ఘర్ జిల్లాల్లోని పాఠశాలలకు ప్రభుత్వం ఇప్పటికే సెలవు ప్రకటించింది.

# సంపాదకీయం

## గుల్‌మొహర్



**"బాజీచా -- ఎ- అత్ఫాల్ హై
దునియా మేరే ఆగే
హోతా హై షబ్ -- ఓ -- రోజ్
తమాషా మేరే ఆగే!" అంటాడు మీర్జా గాలిబ్.? అంటే,**

"నాముందు ఈ ప్రపంచం ఒక పిల్లల ఆట స్థలం, రాత్రింబవళ్లు నా ఎదుట ఒక కొత్త నాటకం ప్రదర్శింపబడుతోంది" అని దాని భావం. గాలిబ్ మొగల్ సామ్రాజ్యపు చివరి దశకు చెందిన ప్రసిద్ధ ఉర్దూ, పర్షియన్ కవి. అనేక జీవిత సత్యాలను, జీవన తాత్వికతలను తన శాయరీ, గజల్స్ ద్వారా సాహిత్య రంగానికి అందించాడు. ఆయన చెప్పినట్లుగానే రోజుకో కొత్త నాటకాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారు నేటి మతతత్వవాదులు.

ఇక్కడ మన హైదరాబాద్‌లోనే ప్రసిద్ధుడయిన మఖ్దూం మొహియుద్దీన్ ఉర్దూ మహాకవి. ఇక్కడి సామాన్య ప్రజల విముక్తి కోసం కవిత్వం రాసి, పాటలు కట్టి, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు. "ఏ జంగ్ హై జంగే ఆజాదీ, ఆజాదీ కే పర్చమ్ కే తలే, హం హింద్ కే రహ్నే వాలోం కి- మజ్దూరోంకి సారా సంసార్ హమారా హై, పూరబ్ పశ్చిమ్, ఉత్తర్, దక్కన్, హం అమెరికీ, హం ఆఫ్రికీ, హం చీనీ జాం బాజానే వతన్" ఈ ప్రపంచమంతా మాదే అంటూ అంతర్జాతీయ గీతాన్ని రాశాడు ఉర్దూలోనే. వీళ్ల శాయరీలను, గజల్స్‌ను, మన దాశరథి, గజ్జెల మల్లారెడ్డి మొదలైన వాళ్లు తెలుగు చేసి మనకందించారు. అవి ఇప్పటికీ మనల్ని కదిలిస్తూనే ఉన్నాయి.

షోయబుల్లాఖాన్ ఈ తెలుగు నేలపైనే అక్షర స్వేచ్ఛను కాపాడటం కోసం రాజీలేని పోరాటం చేసి ప్రాణాల ర్పించాడు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పండితుడు సామల సదాశివ ఉర్దూ సాహిత్య, సంగీత స్వారస్యాన్ని అవపోసన పట్టి తెలుగు సమాజానికి కానుక చేశాడు. భాషా మాధుర్యాలను హృదయం నిండా ఆస్వాదించారు.

ఇవన్నీ భాషకు మతాన్ని అంటగట్టడం ఎంతటి అవివేకమో తెలపడానికి ఉదాహరణలుగా ఇస్తున్నాను. ఉర్దూ మన దేశంలో ఉద్భవించిన భాష. భారతదేశ చరిత్ర, సాహిత్యం సంస్కృతిలో భాగమైనది ఉర్దూ భాష. దాన్ని ఏదో ఒక రాష్ట్రానికి, ప్రాంతానికి, మతానికి పరిమితం చేయటం మూర్ఖత్వంతో కూడుకొన్నది. ఇటీవల నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన..సంఘటన, భాషకు, మతాన్ని ఆపాదించి, పెద్ద రగడనే సృష్టించారు. వాళ్లు అంతే చేస్తారు. ఏదో పేరు చెప్పి మత ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించడం, వైరుధ్యం సృష్టించడం, విద్వేషాగ్నులను పెంచి అధికారంలో కొనసాగడం వారి వ్యూహంలో ఒక భాగం. వారికి చరిత్ర, సంస్కృతికి సంబంధించిన వాస్తవిక జ్ఞానం బొత్తిగా ఉండదు. వక్రీకరణల వక్ర బుద్ధి తప్ప. ఒక ప్రైవేటు పాఠశాలలో ఒక టీచరు ఉర్దూ బోధిస్తున్నాడని తెలుసుకుని సంఘీయులు, బీజేపీ గుంపు పాఠశాలలోకి వెళ్లి ప్రిన్సిపాల్‌పై భౌతిక దాడికి పూనుకున్నారు. అదీ పోలీసుల సమక్షంలోనే దాడి చేశారు. విద్యార్థుల ఎంపికలో ఆ భాష లేనట్లయితే, కంప్లయింట్ చేయవచ్చు. ప్రశ్నించవచ్చు. కానీ వీళ్ల ఉద్దేశ్యము ఏమిటంటే ఉర్దూ అనేది ముస్లింల భాష అనీ, దాన్ని బోధించడం నేరమయినట్లు ఒక విద్వేష తగాదాను సృష్టించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు భాషాపరమైన చర్చనూ చేస్తున్నారు. ఉర్దూ నేర్చుకుంటే, బిర్యానీ తింటే మతం మారిపోతారని భావించడం మూర్ఖత్వంతో కూడిన భావన. ఇంగ్లీష్ మాట్లాడితే క్రిస్టియన్లమై పోయేదుంటే, ఇప్పటికి ఎందరు క్రిస్టియన్లుగా మారేవారో కదా! భాషా సంస్కృతులలో ఆదాన ప్రధానాలు ఉంటాయి. కొన్ని సంప్రదా యాలూ ఉంటాయి తప్ప, మతం ఆధారితంగా భాష ఉండదు. అయినా మన రాష్ట్రంలో తెలుగు, ఉర్దూ భాషలు, ప్రభుత్వం గుర్తించిన అధికార భాషలు. ఎవరేది నేర్చుకుంటారు అనేది వారి భాష ఎంపిక మీద ఆధారపడి ఉంటుంది. ఉర్దూ బోధిస్తే నేరం అన్నట్లు మాట్లాడటం, దాన్ని కేవలం మదరసాల లోనే బోధించే భాషగా చూడటం అన్యాయం. 'ఉర్దూ ఒక భారతీయ భాష. అది దేశం వెలుపల పుట్టలేదు' అని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత మురళీ మనోహర్ జోషి చెప్పాడు. "ఉర్దూ మన సొంత భాష. అది ఇక్కడే పుట్టింది. దాన్ని ముస్లింగా మార్చకండి" అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఉర్దూ రాని ముస్లింలు ఎందరో ఉన్నారు. చాలామంది ముస్లింలకు తెలుగు వస్తుంది ఉర్దూ రాదు. వాళ్లందరు హిందువులై పోతారా! పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో చాలామందికి ఉర్దూ రాదు, పంజాబీ, బంగ్లా మాట్లాడుతారు. గల్ఫ్ దేశాలలో సైతం అరబిక్, టర్కిష్, పర్షియన్ భాషలు మాట్లాడుతారు. భాష అనేది, ప్రజలు ఒకరితో ఒకరు సంబంధం పెట్టుకోవడానికి, ఒకరి భావాలు ఒకరు చెప్పుకుని, ఒకరి నొకరు తెలుసుకోవడానికి సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో సాధనంగా ఆవిర్భవించింది. మానవ వికాస క్రమానికి, భావాభివృద్ధికి భాష దోహదం చేస్తుంది. తప్ప ఒక మతాన్ని ప్రతిబింబించదు. జీవన విధానంలో మానవ సమూహాల మధ్య పరస్పర కలబోతలకు సాధనంగా భాష ఉంటుంది. పదిహేడు భాషలు నేర్చుకున్న పి.వి. నరసింహారావు, నలిమెల భాస్కర్ హిందువు కాకుండా పోయారా? తెలుగు నేర్చుకున్న బ్రౌను హిందువై పోయారా? మన దేశంలో వందలాది భాషలు మాట్లాడే ప్రజలున్నప్పటికీ, అనేక సాంస్కృతిక సంప్రదాయ వైవిధ్యాలున్నప్పటికీ ఇంతకాలంగా సమైక్యంగానే ఉన్నాము కదా! భాషా పరిమళాలను ఆస్వాదించాలే కానీ మతద్వేషాలను రగల్చకూడదు.

# మీకు దమ్మంటే బీజేపీలో చేరి మాట్లాడండి..

## రెబెల్స్‌పై మమతాబెనర్జీ ఫైర్..!


**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):**
తృణమూల్ కాంగ్రెస్ లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. బీజేపీ తమ పార్టీలో చీలికలపై దృష్టి పెట్టిందన్నారు. టీఎంసీ లో చోటుచేసుకుంటున్న మార్పులకు కాషాయ పార్టీనే కారణమని, అసమ్మతి నేతలను రెచ్చగొడుతోందని అన్నారు. తమ పార్టీలో నిజాయతీ లేని కొందరు నేతలు బీజేపీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. ధైర్యముంటే నేరుగా బీజేపీలో చేరి తనను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు.తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య రాజీనామా.. తదనంతర పరిణామాల నేపథ్యంలో మమతా బెనర్జీ సోషల్



మీడియా వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. అంతకుముందు మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా పేరున్న చంద్రిమా బెంగాల్ తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. పార్టీలో అన్ని బాధ్యతల నుంచి వైదొలుతున్నట్లు ప్రకటించారు. విశ్వాసం లేనిచోట పనిచేయడం సాధ్యంకాదని, అందుకే పార్టీని వీడుతున్నానని చెప్పారు. అయితే రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన నెల రోజులకే ఆమె రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు ఈ నిర్ణయం ప్రకటించిన కొన్ని నిమిషాల్లోనే రెబల్ నేతలతో కలిసి ఓ సమావేశంలో చంద్రిమా పాల్గొనడం గమనార్హం. మమతా బెనర్జీకి నాపై విశ్వాసం సన్నగిల్లినట్లు కనిపించిందని, నాపై నమ్మకం లేనప్పుడు పార్టీ కార్యకర్తగా కొనసాగడం కష్టమని చెప్పారు. కొందరు నేతలు నా నిజాయతీని ప్రశ్నిస్తున్నారని, నా గురించి మమతాబెనర్జీకి అన్నీ తెలుసని తెలిపారు. గతంలో ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆమెను జూన్ 3న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దీదీ నియమించింది.

# ఇంటర్ ఫస్టియర్‌లో 34 పర్సెంట్.. బీటెక్‌లో 24 బ్యాక్‌లాగ్‌లు.. ఆ తర్వాత ఏడాదిన్నరలో ఐపీఎస్ అధికారి..!

**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):**
మార్కులే జీవితాన్ని నిర్ణయిస్తాయని చాలామంది అపోహ పడుతుంటారు. ఒకసారి చదువులో వెనుకబడితే అంతే అనుకుని నిరాశలోకి వెళ్లిపోతారు. కానీ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ వైఫల్యాన్నైనా విజయంగా మార్చుకోవచ్చని ఐపీఎస్ అధికారి సమీర్ శర్మ నిరూపించారు. సమీర్ శర్మ స్కూల్ రోజుల నుంచే మెరిట్ విద్యార్థి కాదు. పదో తరగతిలో 57 శాతం మార్కులు వచ్చాయి. ఇంటర్ ఫస్టియర్‌లో పరిస్థితి మరింత దారుణమైంది. కేవలం 34 శాతం మార్కులే వచ్చాయి.తర్వాత సెకండియర్‌లో కొంత మెరుగుపడి ఇంటర్ పూర్తిచేసే సమయానికి 60 శాతం మార్కులు సాధించారు. అయితే అతడు ఐపీఎస్ అధికారి అవుతాడని అప్పట్లో ఎవరూ ఊహించలేదు. ఇంటర్ అయిపోయాక బీటెక్‌లో చేరారు. కొత్త జీవితానికి అది మంచి ప్రారంభం అవుతుందని భావించారు. కానీ ఇంజినీరింగ్ ఆయనకు అత్యంత కఠినమైన దశగా మారింది. చదువులో ఇబ్బందులు ఎదురవడంతో మొత్తం 24 బ్యాక్‌లాగ్స్ పడ్డాయి. ఇలాంటి పరిస్థితిలో చాలామంది విద్యార్థులు ఆత్మవిశ్వాసం కోల్పోతారు.



తమ భవిష్యత్తుపై ఆశలు వదులుకుంటారు. సమీర్ శర్మ మాత్రం అలా చేయలేదు. తన వైఫల్యాలను జీవితానికి ముగింపు కాకుండా కొత్త ప్రారంభంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌పై దృష్టిపెట్టారు. క్రమశిక్షణతో చదవడం ప్రారంభించారు. ప్రతిరోజూ నిరంతరం శ్రమించారు. ఇతరులతో పోల్చుకోకుండా తన లక్ష్యంపైనే దృష్టిపెట్టారు. ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివిన అభ్యర్థులను చూసి తాను తక్కువనుకోలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకుసాగారు. ఆ కృషి ఫలితంగా కేవలం 18 నెలల్లోనే యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించారు. ఆలిండియా ర్యాంకు 182 దక్కించుకున్నారు. 2011 బ్యాచ్ 'ఏజీఎంయూటీ' క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. అనంతరం ఢిల్లీ పోలీస్ విభాగంలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా కూడా సేవలందించారు. తన గత వైఫల్యాలను సమీర్ ఎప్పుడూ దాచిపెట్టలేదు. వాటినే విద్యార్థులకు స్ఫూర్తిగా చెబుతుంటారు. విజయానికి ముందు మనసులోని భయాన్ని, ఆత్మన్యూనతను జయించాలని సూచిస్తారు. ఇతరుల విజయాలతో మన ప్రారంభాన్ని పోల్చుకోవద్దని చెబుతారు. ప్రతి ఒక్కరి ప్రయాణం వేరుగా ఉంటుందని గుర్తుచేస్తారు. లక్ష్యంపై దృష్టిపెట్టి నిరంతరం శ్రమిస్తే విజయం తప్పక దక్కుతుందని యువతకు సందేశం ఇస్తుంటారు. సమీర్ శర్మ ప్రయాణం ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. తక్కువ మార్కులు, బ్యాక్‌లాగ్స్ లేదా గత వైఫల్యాలు భవిష్యత్తును నిర్ణయించవని, వాటిని అధిగమించే పట్టుదలే మన జీవితాన్ని కొత్త దిశగా తీసుకెళుతుందని స్పష్టంచేశారు.

# మద్యం తాగుతున్నాడని కొడుకును చంపిన తల్లిదండ్రులు..

### ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం

**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):**
గుజరాత్‌లో తల్లిదండ్రులు తమ కొడుకుపై దారుణానికి పాల్పడ్డారు. మద్యం తాగుతున్నాడని కొడుకును హత్య చేశారు. ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేశారు. మృతుడిని 23 ఏళ్ల రామ్ బాబుభాయ్ బంభవగా గుర్తించారు. ఈ ఘటన గుజరాత్, రాజ్‌కోట్ జిల్లా, గోండల్ తాలూకా, గుండాల గ్రామంలో ఇటీవల జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల గ్రామానికి చెందిన బాబుభాయ్ అలియాస్ అతుల్‌భాయ్ గుఘాభాయ్ బంభవ, మనిషాబెన్ అలియాస్ మోతిబెన్ దంపతుల కొడుకు రామ్ బాబుభాయ్. అతడికి నాలుగు నెలల క్రితం బన్నిబెన్ బంబువా అనే యువతితో వివాహమైంది.అయితే, రామ్



బాబుభాయ్‌కు అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈ విషయంలో అతడికి, తల్లిదండ్రులకు నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో జూన్ 30న కూడా రామ్ బాబుభాయ్ మద్యం సేవించి రావడంతో అతడికి, తల్లిదండ్రులకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆవేశానికి గురైన రామ్ తల్లిదండ్రులు అతడితో బలవంతంగా యాసిడ్ తాగించారు. అనంతరం గొంతునులిమి చంపేశారు. అయితే, ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే, రామ్ తండ్రి తనకున్న రాజకీయ పలుకుబడి వాడుకోవాలని చూశాడు. స్థానిక నేతలను కలిసి.. త్వరగా పోస్టుమార్టం జరిగేలా ఒత్తిడి తెచ్చాడు. అతడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, ఆత్మహత్య చేసుకున్నాడని, కాబట్టి తూతూమంత్రంగా పోస్టుమార్టం పూర్తి చేయాలని కోరారు. అయితే, రామ్ భార్య బన్నిబెన్ బంబువా ఇచ్చిన ఫిర్యాదుతో అతడి తల్లిదండ్రులపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ పోస్టుమార్టంలో రామ్ హత్యకు గురైనట్లు తేలింది. అతడిపై దాడి జరిగిందని, గొంతునులిమి చంపేశారని వైద్యులు గుర్తించారు. దీంతో రామ్ తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారించగా తమ నేరాన్ని అంగీకరించారు. తామే కొడుకును హత్య చేసినట్లు గుర్తించారు. నిందితుల్ని అరెస్టు చేసిన పోలీసులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# రాజస్థాన్‌లో రిఫైనరీ ప్రారంభించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):**
రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో పాచపద్ర రిఫైనరీని ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని తొట్టతొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. భారతీయ ఇంధన, పెట్రో కెమికల్ రంగంలో ఇది కీలకమైన మైలురాయి అని పేర్కొన్నారు. రిఫైనరీ కాంప్లెక్స్ టూర్ చేసిన తర్వాత ఆయన రిమోట్ బటన్ నొక్కి ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రతి ఏడాది ఆ రిఫైనరీలో సుమారు 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను రిఫైన్ చేయనున్నారు. అంతకముందు ఆయన జోధ్‌పూర్ ఎయిర్‌పోర్టులో కొత్త టర్మినల్‌ను ఓపెన్ చేశారు. కొత్త ఉడాన్ స్కీమ్‌ను ఆవిష్కరించారు. రాబోయే పదేళ్ల కోసం 29 వేల కోట్లు కేటాయించారు.ఇంకా జైపూర్ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం కూడా ఆయన శంకుస్థాపన చేశారు. 13వేల కోట్లు ఆ ప్రాజెక్టు కోసం ఖర్చు చేయనున్నారు. కొన్ని రైల్వే ప్రాజెక్టులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు అస్వస్థత..

### -ఆస్పత్రికి తరలింపు..!



**న్యూఢిల్లీ జూన్ 4(మహాప్రభ):**
మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అస్వస్థతకు గురయ్యారు. గత రెండు రోజులుగా స్వల్ప జ్వరం, తీవ్ర నీరసం, ఒళ్లు నొప్పులతో ఆయన బాధపడుతున్నారు. వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు షిండేను థానేలోని జూపిటర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు వివిధ వైద్య పరీక్షలు జరుగుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కొన్ని రోజులుగా వరుస రాజకీయ కార్యక్రమాలు, ఎన్నికల సన్నాహాలు, ప్రభుత్వ వ్యవహారాలు, విపరీతమైన పనిభారం కారణంగా షిండే ఆరోగ్యం దెబ్బతిన్నట్లు తెలుస్తున్నది. ఆయన త్వరగా కోలుకోవాలని రాజకీయ నాయకులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై
# బిజేపి భారీ ఆందోళన

**-కేటగిరి 8 కనెక్షన్లతో ప్రజలపై అదనపు భారం మోపొద్దు సామ రంగారెడ్డి**

**-విద్యుత్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మండిపాటు.**

**ఎల్‌బినగర్ - జూలై 4 (మహాప్రభ)**
టీ ఎస్ పి డి సీ ఎల్ టి, ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యుత్ సేవల్లో కొనసాగుతున్న నిర్లక్ష్యం, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎల్ బి నగర్‌లో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎల్ బి నగర్ అసెంబ్లీ మరియు మేడ్చల్ రూరల్ ఇంచార్జి సామ రంగారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రజలపై అనవసరమైన ఆర్థిక భారం పడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ బి నగర్ నియోజకవర్గంలో విద్యుత్ సేవల నిర్వహణలో ప్రణాళికా లోపాలు, తరచూ విద్యుత్ అంతరాయాలు, కొత్త కనెక్షన్ల మంజూరులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లక్షల రూపాయలు చెల్లిస్తున్న వినియోగదారులకు కూడా నాణ్యమైన విద్యుత్ సేవలు అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా కొత్తగా నిర్మిస్తున్న గృహాలు, వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా కేటగిరి 8 విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని టీ ఎస్ పి డి సీ ఎల్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కనెక్షన్ కోసం రూ.45 వేల వరకు



డిపాజిట్ చెల్లించాల్సి రావడంతో పాటు యూనిట్‌కు రూ.12 వరకు వసూలు చేయడం గృహ నిర్మాణదారులపై తీవ్ర ఆర్థిక భారంగా మారిందన్నారు. గృహ నిర్మాణాలకు డొమెస్టిక్ మీటర్లనే మంజూరు చేసి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఆధారంగా విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. సాయి నగర్ కాలనీలో 118 జీఓ అమల్లో ఉన్నప్పటికీ కన్వీనియన్స్ డీడ్ లేకపోవడం కారణంగా ఇంటి నిర్మాణ అనుమతులు, విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా డీడ్ చేయించుకోలేని కుటుంబాలకు కూడా ఎలాంటి వివక్ష లేకుండా విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరారు. అపార్ట్మెంట్ల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ 11 కేవీ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అందించకుండా సాధారణ పబ్లిక్ లైన్ల ద్వారా విద్యుత్ ఇస్తుండటంతో అధిక లోడ్ ఏర్పడి తరచూ విద్యుత్ అంతరాయాలు జరుగుతున్నాయని విమర్శించారు. అపార్ట్మెంట్లకు ప్రత్యేక 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో ఓవర్ హెడ్ విద్యుత్ లైన్ల స్థానంలో కేంద్ర ప్రభుత్వ ఆర్ డి ఎస్ ఎస్ ఆర్ పథకం ద్వారా అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సామ రంగారెడ్డి కోరారు. దీంతో ప్రజల భద్రత పెరగడంతో పాటు చెట్ల నరికివేత తగ్గి నగర సౌందర్యం మెరుగుపడుతుందని అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రాబోయే బీజేపీ మేయర్ ఆధ్వర్యంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసి కరెంటు స్తంభాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని సామ రంగారెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యుత్ సేవలను మెరుగుపరచాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.

**సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్.**



**దేవరకొండ జూలై 4 ( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య కమ్యూనిస్టువాదిగా, తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు అయిన వీరుడు. ఈయన పెత్తందారి వ్యవస్థ, భూస్వాముల నుంచి అనేకమంది వద్ద ఉన్నటువంటి భూములను పేదలకు పంపిణీ చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయననుఆదర్శంగా తీసుకొని దేశంలో ఉన్నటువంటి యువత, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కులాలు ఐక్యమై బీసీలు రాజ్యాధికార దిశగా ముందుకెళ్లాలని కోరారు. బీసీలు ఐక్యమై రాజ్యాధికారం వస్తేనే బీసీల కావలసినటువంటి హక్కులు సాధించుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పూనా వెంకటేష్ నేత, డాక్టర్ భాషా చౌహాన్, భీమగోని శివగౌడ్, మునగాల గణేష్, శివ, లైబ్రేరియన్ శారద తదితరులు పాల్గొన్నారు.

## లాలు నాయక్ సేవలు చిరస్మరణీయం

**-దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ జూలై 4 ( మహాప్రభ )**
రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు రమావత్ లాలు నాయక్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం చందంపేట మండలం బిల్డింగ్ తండాలో రమావత్ లాలు నాయక్ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.....లాలు నాయక్ పేద ప్రజల పక్షపాతిగా, ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. లాలు నాయక్ ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్న ఆయన, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**ఎల్‌బినగర్ - జూలై 4 (మహాప్రభ )**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినట్లు ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన దొడ్డి కొమురయ్య త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని, తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య కి మరోసారి ఘన నివాళులు అర్పిస్తూ, జై దొడ్డి కొమురయ్య జై తెలంగాణ అని నినదించారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య.

**-అదనపు కలెక్టర్ నగేష్.**



**మెదక్ జిల్లా - 04జూలై (మహాప్రభ**
తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 81వ వర్ధంతి సందర్భంగా శనివారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వం నుంచి బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ అంబదాస్ రాజేశ్వర్, డిపిఓ యాదయ్య,గిరిజన సంక్షేమ అధికారి నీలిమ డీఈఓ రాజు బీసీ సంక్షేమ అధికారులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అన్నీ--అక్కా మెంటర్‌షిప్ ఏఐ & డిజిటల్ ట్రైనింగ్' కార్యక్రమం



**దేవరకొండ జూలై 4 (మహాప్రభ)**
మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), దేవరకొండలో “అన్న - అక్క మెంటర్షిప్ ఏఐ & డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ “ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మంచి నైపుణ్యం ఏర్పడుతుందని, ప్రస్తుత ఏఐ తరుణంలో ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని డిగ్రీ విద్యార్థులకు ఇదొక మంచి సువర్ణ అవకాశం మీరు నేర్చుకొని పాఠశాల విద్యార్థులకు బోధించడం ద్వారా మీకు కూడా పర్సనల్ డెవలప్మెంట్ అవుతుందని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అదనపు నైపుణ్యాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా జి.లింగారెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, బి.సురేష్ లెక్చరర్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. కె.పృథు, ఎ.శ్రీను, వి.వెంకటేష్, వి. యాదయ్య, పి.కొండల్, ఎస్.నర్మదాదేవి, ఎం. జగపతి బాబు , కె.నాగరాజు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను
# కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తోంది

**- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాం రెడ్డి**

**ఎల్ బి నగర్ - జులై 4 (మహాప్రభ)**
ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని చింతల్‌కుంట, మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉద్యమకారుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశానికి ఎల్ బి నగర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాం రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాలను అర్పించి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు మళ్లీ గౌరవం





దక్కుతోందని, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సేవలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తూ, వారికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాం రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యమకారుల హక్కుల సాధన సమితి ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రమావత్ లక్ష్మి మృతి బాధాకరం

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ డివిజన్ జూలై 4 ( మహాప్రభ )**
దేవరకొండ మండలం శక్రు తండా గ్రామ సర్పంచ్ రామావత్ మోహన్ లాల్ తల్లి రమావత్ లక్ష్మి మృతి బాధాకరం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం శక్రు తండాలో రమావత్ లక్ష్మి మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......లక్ష్మి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.లక్ష్మి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన భగవంతుని ప్రార్థించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## రామ్ నుంతల గ్రామపంచాయతీలో హర్ ఘర్ జల్

**ఆమనగల్లు, - జులై 4 (మహాప్రభ)**
ఆమనగల్లు మండల పరిధిలోని రామ్మునంతల గ్రామపంచాయతీ లో శనివారం'హర్ ఘర్ జల్' అనే కార్యక్రమాన్ని సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్, మిషన్ భగీరథ ఏఈ జయశ్రీ తో కలిసి నిర్వహించారు. రాముసుంతల గ్రామపంచాయతీలో ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రతి గ్రామీణ



కుటుంబానికి, ప్రతి ఇంటికి సురక్షితమైన కులాయి నీటిని నిరంతరాయంగా అందించడమే దీని ఉద్దేశమని సర్పంచ్ శ్రీను నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్,వార్డు సభ్యులు ధనరాజ్ గ్రామ కార్యదర్శి యాదగిరి,మాజీ వార్డు సభ్యులు కృష్ణ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికల్లు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**దేవరకొండ జూలై 4 ( మహాప్రభ )**
నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లోని నెల్లికల్లు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాష్ట్ర నీటి పారుదల శాఖ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం,సందర్శించి ప్రాజెక్టు పనులు, పరిస్థితులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎంఎల్సీ శంకర్ నాయక్, మాజీ జిల్లా చైర్మన్ కర్నాటి లింగారెడ్డి హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,నాగార్జునసాగర్ మున్సిపల్ చైర్మన్ , హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి నాగార్జునసాగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రసాద్ ,తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ కి విచ్చేయుచున్న మంత్రి ని టి పి సి సి. సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు సమృద్ధిగా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.

## కొండ భీమనపల్లి గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం.



**దేవరకొండ డివిజన్ 24 ( మహాప్రభ**
దేవరకొండ కొండ భీమనపల్లి గ్రామపంచాయతీ లో భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సార్ కార్యక్రమంలో భాగంగా, కొండ భీమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సందర్భంగా బీఎల్ఓ కలుగోని నగేష్ ఆధ్వర్యంలో ఓటర్ల వివరాలను సేకరించి, అవసరమైన ఫారమ్‌లను పూరించడంలో ప్రజలకు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో 70వ బూత్ బీజేపీ బీఎల్ఏ ఎర్ర బిక్షపతి పాల్గొని, ఓటర్లకు అవసరమైన సూచనలు చేస్తూ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలని, అవసరమైతే సంబంధిత ఫారమ్‌లను సమర్పించి ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

-జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్



**మెదక్ జిల్లా -04జూలై ( మహాప్రభ**
అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్, వారి సిబ్బంది మరియు స్టేట్ టాస్క్ ఫోర్స్ టీమ్-2, హైదరాబాద్ అధికారులతో కలిసి మెదక్ పట్టణంలోని ఎన్. నర్సమ్మ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784018 లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని విద్యానంద్ తెలిపారు.తనిఖీలలో షాపులో 12.42 క్వింటాళ్ల సన్న బియ్యం మరియు 61.28 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత డీలర్‌పై అత్యావశ్యక వస్తువుల చట్టం, 1955 ప్రకారం సెక్షన్ 6-ఎ కింద కేసు నమోదు చేయడం జరిగింది.రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు, తదుపరి జిల్లా కలెక్టర్ (సివిల్ సప్లైస్) వారి ఆదేశాలు వెలువడే వరకు దుర్గాప్రసాద్ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784002 కు సదరు షాపు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరా అధికారి మాట్లాడుతూ, మెదక్ జిల్లాలోని ఏ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ అయినా పీడీఎస్ బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలించడం, మళ్లించడం లేదా దుర్వినియోగం చేసినట్లు గుర్తిస్తే, వారిపై కూడా సెక్షన్ 6-ఎ కింద కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.

## దమ్మాయిగూడలో చెత్త సేకరణపై ఆటో సిబ్బందికి హెచ్చరిక....



**నాగారం, జూన్ 4(మహాప్రభ):**
కీసర సర్కిల్ పరిధిలో ని దమ్మాయిగూడ వార్డ్ కార్యాలయంలో ఇంటింటికి చెత్త సేకరించే ఆటో సిబ్బందితో శనివారం డిప్యూటీ కమిషనర్ జి రాలింగం సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి ప్రతిరోజూ వెళ్ళి చెత్త సేకరించాలని ఆయన ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డబ్ల్యూఎం డిఈ సంతోష్, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## అమెరికాలో సోదరుడి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్‌బినగర్ - జులై 4( మహప్రభ )**
అమెరికాలో తన సోదరుడి కుమార్తె వివాహ వేడుకల సందర్భంగా నిర్వహించిన హల్దీ కార్యక్రమంలో ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వివాహ వేడుకల్లో ఆత్మీయంగా పాల్గొని ఆనందోత్సాహాలను పంచుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన హల్దీ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో మమేకమై, వివాహ వేడుకలను సంతోషకర వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితంలో ప్రతి అడుగు విజయవంతంగా సాగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన పెంపు..

- ఎన్యుమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని సూచన

**శివ్వంపేట జూన్ 4(మహాప్రభ):**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను ప్రతి ఓటరు గుర్తించాలని, SIR-2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సంబంధిత బీఎల్‌వో లకు అందజేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందజేయబడుతుందని, ఓటర్ ఐడీ కార్డు ఉన్నా, గత ఎన్నికల్లో ఓటు వేసినా ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయరాదని అధికారులు తెలిపారు. ఫారాన్ని పూర్తిగా నింపి, అవసరమైన ఫోటోను జతచేసి నిర్ణీత గడువులోపు బీఎల్‌వోకు అందజేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించని పక్షంలో ఓటరు వివరాల పరిశీలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి అర్హులైన ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు. “ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత.. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ఎన్యుమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించండి” అని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

## చైతన్యపురిలో ఎస్ఐఆర్- 2026 గణన ఫారాల పంపిణీ



**చైతన్యపురి,జూన్ 4(మహాప్రభ):**
ఎస్.ఐ.ఆర్ ఓటర్ వెరిఫికేషన్ లో భాగంగా ఈరోజు చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి బి ఎల్ వో అజయ్ తో కలిసి ద్వారకాపురంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి వారికి ఓటర్ ఫార్మ్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో పేరు నమోదు సవరణలు మార్పులు చేసుకోవాల్సిన వారు తమకు కేటాయించిన బూతుల వద్ద బిఎల్ఓ లను సంప్రదించి గణన పారాలు తీసుకొని ఎస్ ఐ ఆర్- 2026 లో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటర్ ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తులసి కృష్ణ గౌడ్, జలంధర్, నవీన్, రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి,డి ఎ లు ఇవ్వాలి.

-తపస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి పత్రం ...



**పాపన్నపేట, జూలై 4( మహా ప్రభ )**
ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన 6 డిఏలు, పి ఆర్ సి ని వెంటనే ఇవ్వాలని తపస్ మండల నాయకుడు దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల ప్రకారం పాపన్నపేట తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, హెల్త్ కార్డ్స్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో తపస్ పాపన్నపేట నాయకులు బోయినీ రాజశేఖర్, తపస్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు జిల్లా బాధ్యులు ప్రసాద్ రెడ్డి, తులసిరామ్, ప్రవీణ్ కుమార్, టి. నర్సింలు, ఉపాధ్యాయులు: శ్రీనివాస్,చంద్రశేఖర్ గౌడ్, లక్ష్మీనారాయణ, విశ్వనాథం, మనోజ్, రమేష్, ప్రభాకర్, నరేష్... తదితరులు పాల్గొన్నారు..

## నిరుపేద కార్మికుల ఇంటిస్థలాలను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

-కార్మికులు తాసిల్దార్ వినతి పత్రం





**గాంధారి జులై 4 (మహాప్రభ)**
బీడి కార్మికుల ఇంటి స్థలాలను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ రేణుక చౌహన్, గాంధారికి చెందిన నిరుపేద కార్మికులు బాధితులు శనివారం వినతి ప్రతం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయని తాసిల్దార్ తెలియజేశారు. జువ్వాడి గ్రామ శివారులోని 2010లో ఉత్తునూర్ చెందిన సంజీవ్ రావు తన 6 ఎకరాల వ్యవసాయ భూమి సర్వే నంబర్110, 109లో వెంచర్ షాట్లుగా మార్చి విక్రయించారు. గాంధారి మండల సుమారు 300 మంది బీడికార్మికులు నిరుపేద కార్మికులు వెంచర్లో ఇంటిస్థలాలను కొనుగోలు చేశారు. ఇటివలే గుర్తుతెలియని తమ భూములను కబ్జా చేసి ట్రాక్టర్ తో దుక్కి దున్ని పంట చేశారని పేర్కొన్నారు. తమ ఇంటి స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా చూడాలని, తక్షణమే కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ను కోరారు. అనంతరం జువ్వాడి చెందిన సర్పంచ్ శాంతవ్వ, కార్యదర్శి చంద్రకాంత్, ఉపసర్పంచ్ సంతోష్, వార్డ్ మెంబర్ సాయిమల్లు, వినతి పత్రం ఇచ్చారు. బాధితులు లక్ష్మణ్, శ్రీనివాస్, శివ, శ్రీను, శంకర్, సాయిలు, సంతోష్, సంజీవ్, సాయి, శంకర్, అంబదాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం.






-నాణ్యమైన విత్తనాల పంపిణీయే సమృద్ధి పంటల కు శ్రీకారం

-ఆత్మ కమిటి నియోజకవర్గ చైర్మన్ పూజల గోపికృష్ణ

**సిద్దిపేట జులై 4,(మహాప్రభ)**
నేడు సిద్దిపేట అర్బన్ పొన్నాల గ్రామంలో నిర్వహించిన రైతు వేదిక కార్యక్రమానికి సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి రైతులకు కంది మరియు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి, వారి ఆదాయాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కంది, పత్తి పంటలు తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలకమైనవని పేర్కొంటూ, రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలు పాటిస్తే పంట దిగుబడులు మెరుగుపడటంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గే అవకాశముందని వివరించారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతు భరోసా, నాణ్యమైన విత్తనాల పంపిణీ, ఎరువుల అందుబాటు, సాగునీటి సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు ప్రకృతి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేయాలని, సమగ్ర పంట నిర్వహణ పద్ధతులను పాటించాలని, అవసరమైనప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు. రైతుల కష్టానికి తగిన గౌరవం, గిట్టుబాటు ధర, ప్రభుత్వ అండ ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ లు శ్రవణ్.జనార్ధన్ రెడ్డి.అజ్మత్.లక్ష్మి నారాయణ.శ్రీనసీవ్. నాగరాజు.సర్పంచ్. ఉపసర్పంచ్. .అధికారులు శ్రీనాథ్. మీరా.గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ ను తనిఖీ చేసిన ఈఎంఈ రాజబాబు



**ఆమనగల్లు,జూన్ 4(మహాప్రభ):**
రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని 108 ఈఎంఈ రాజబాబు అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మందులు అంబులెన్స్ లో అందుబాటులో ఉన్నాయా లేవా అని ఈఎంటి మహేష్, కళ్యాణ్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాహనంలో ఉన్న వైద్య పరికరాలను రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట పి యం జోన్ సైడ్ ఉన్నారు.

# బిజినెస్

## మళ్లీ షాకిస్తోంది.. పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలు


గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. కానీ ఉన్నట్టుండి ఒక్క రోజులోనే భారీగా పెరిగింది. గత కొన్ని రోజులుగా దేశీయంగా పసిడి ధరలు రికార్డు స్థాయిలో పడిపోతుండటం ధరల నుంచి ఉపశమనం పొందుతున్న మహిళలకు ఇప్పుడు షాకిస్తున్నాయి. అయితే నిన్న తులం బంగారం ధరపై ఏకంగా రూ.3 వేలకుపైగా ఎగబాకింది. అలాగే వెండిపై రూ.5 వేల వరకు పెరిగింది. ఇక జూలై 4వ తేదీన బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ప్రతి రోజు బంగారం ధరలు ఉదయం 11 గంటల ప్రాంతంలో అప్‌డేట్ అవుతుంటాయని గుర్తించుకోండి.



**ప్రధాన నగరాల్లో ధరలు:**

హైదరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,760 వద్ద ట్రేడవుతోంది.
విజయవాడ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,760 వద్ద ట్రేడవుతోంది.
ఢిల్లీ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,910 వద్ద ట్రేడవుతోంది.
ముంబై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,760 వద్ద ట్రేడవుతోంది.
చెన్నై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,37,010 వద్ద ట్రేడవుతోంది.
బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,760 వద్ద ట్రేడవుతోంది.
కోల్‌కతా -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,760 వద్ద ట్రేడవుతోంది.
ఇక వెండి విషయానికొస్తే.. హైదరాబాద్, చెన్నై, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,60,100 వద్ద ట్రేడవుతుండగా, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు ప్రాంతాల్లో రూ.2,50,100 వద్ద ట్రేడవుతోంది.

## కీవే నుంచి నయా స్కూటర్



**హైదరాబాద్**

దేశీయ మార్కెట్లోకి అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది కీవే ఇండియా. హైప్‌వోల్ట్-ఆర్ పేరుతో విడుదల చేసిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ స్కూటర్‌ను ఆన్‌లైన్‌లో రూ.5 వేలు చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది. కేవలం 2.3 సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్ గంటకు 115 కిలోమీటర్లు ప్రయాణించనున్నదిఅలాగే 5 కిలోవాట్ల బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 5 కిలోవాట్ల డ్యూయల్ రిమూవబుల్ బ్యాటరీ, రియర్ రీవర్స్ కెమెరా, బ్లైండ్ స్పాట్ డిటెక్షన్, ట్రాక్షన్ కంట్రోల్, డ్యూయల్-చానెల్ ఏబీఎస్, హిల్ హోల్డ్ వంటి ఫీచర్స్‌తో ఈ స్కూటర్‌ను తయారు చేసింది. కేవలం మూడు గంటల్లోనే బ్యాటరీ 80 శాతం వరకు రీచార్జికానున్నది.

## భారత ఈ20 పెట్రోల్‌కు నో చెప్పిన భూటాన్.. ఎందుకంటే..!

ఇంధనంలో ఇథనాల్ వినియోగాన్ని పెంచేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో పొరుగు దేశం భూటాన్ ఈ20 పెట్రోల్ ను తిరస్కరించింది. సాధారణ పెట్రోల్‌నే సరఫరా చేయాలని భారత చమురు మార్కెటింగ్ సంస్థలను భూటాన్ కోరింది. ఇందుకు భూటాన్ పేర్కొన్న కారణాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. భూటాన్‌లోని పాత భూగర్భ ఇంధన నిల్వ ట్యాంకులు ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా లేవని అక్కడి ప్రభుత్వం తెలిపింది. ఇథనాల్ తేమను సులభంగా పీల్చుకునే గుణం కలిగి ఉండటంతో ట్యాంకుల్లోకి నీరు చేరితే ఇంధనం కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నది.వాహనాల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని భూటాన్ ఆందోళన వ్యక్తంచేసింది. అంతేకాదు భూటాన్‌లో ఎక్కువ ప్రాంతాలు కొండలు, ఎత్తైన రహదారులతో ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో వాహనాలకు పూర్తిశక్తి అవసరమవుతుందని, ఈ20 పెట్రోల్ అదేస్థాయి పనితీరును అందిస్తుందో లేదో అన్న సందేహం కూడా అధికారుల్లో ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. భూటాన్ మరో విజ్ఞప్తి కూడా చేసింది. భవిష్యత్తులో భారత్ ఈ25 లేదా పూర్తిగా ఇథనాల్ ఆధారిత ఇంధనానికి మారితే ముందుగానే సమాచారం ఇవ్వాలని కోరింది. భూటాన్ తనకు అవసరమైన మొత్తం పెట్రోల్, డీజిల్‌ను భారత్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారతీయ పెట్రోల్ బంకుల్లో లభించే ఇంధనం కాకుండా, ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే నాణ్యమైన ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది. భారత్‌లో ఈ20 పెట్రోల్‌పై ఇప్పటికే చర్చ కొనసాగుతోంది. 2023కు ముందు తయారైన కొన్ని పెట్రోల్ వాహనాల యజమానులు మైలేజీ తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం మైలేజీ కొంత తగ్గినా ఇంజిన్ పనితీరు, యాక్సిలరేషన్ మెరుగుపడతాయని చెబుతోంది.




# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన వైభవ్..

### 37 ఏళ్ల రికార్డు కనుమరుగు..!

అంతర్జాతీయ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ అడుగుపెట్టాడు. కోట్లాదిమంది ఎదురుచూపులకు ముగింపు పలుకుతూ ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నోడు వస్తూనే రికార్డులు నెలకొల్పాడు. ఇంగ్లండ్‌తో రెండో టీ20లో డెబ్యూ క్యాప్ అందుకున్న వైభవ్ 15 ఏళ్లకే తొలి మ్యాచ్ ఆడిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. టీమిండియా తరఫున ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా అవతరించాడు. 1989లో సచిన్ టెండూల్కర్ సాధించిన రికార్డును బద్దలు కొట్టేశాడీ యువకెరటం.జూనియర్ స్థాయిలో శతకాలతో హోరెత్తించిన వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి వస్తూనే రికార్డుల దుమ్ము దులిపాడు. జూలై 4 శనివారం టీ20ల్లో అడుగుపెట్టిన వైభవ్ భారత్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. దాంతో, సచిన్ కంటే ఏడాది ముందే ఈ ఘనత సొంతం చేసుకున్నాడీ చిచ్చరపిడుగు.మూడో చిన్నోడిగా సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ ఆడాడు. 1989లో పాకిస్థాన్‌తో కరాచీలో జరిగిన మ్యాచ్‌లో ఆడడం ద్వారా మాస్టర్ బ్లాస్టర్ రికార్డు సాధించాడు. వైభవ్ విషయానికొస్తే.. 15 ఏళ్ల 99 రోజుల వయసులో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఇక.. అంతర్జాతీయంగా చూస్తే 15 ఏళ్లకే ఆగమనం చేసిన మూడో చిన్నోడిగా వైభవ్ గుర్తింపు తెచ్చుకున్నాడు. మొహమ్మద్ షరీఫ్(బంగ్లాదేశ్), ముష్తక్ మొహమ్మద్(పాకిస్థాన్) ఈ ఘనత సొంతం చేసుకున్నారు. అనంతరం మొత్తంగా అత్యంత చిన్న వయస్కుడి రికార్డు మాత్రం పాకిస్థాన్ క్రికెటర్ హసన్ రజా పేరిట ఉంది. 1996లో తొలి మ్యాచ్ ఆడే సమయానికి అతడి వయసు 14 ఏళ్ల 227 రోజులు మాత్రమే.




## అర్ధ శతకాలతో మెరిసిన జురెల్, సరాన్ష్.. స్వల్ప ఆధిక్యంలో భారత-ఏ..!

రెండో అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ సాయి సుదర్శన్(168), దేవ్‌దత్ పడిక్కల్(94)లు శతక భాగస్వామ్యంతో బలమైన పునాది వేయగా మిడిలార్డర్‌లో ధ్రువ్ జురెల్(53), సరన్ష్ జైన్(68 నాటౌట్) హాఫ్ సెంచరీలతో కదం తొక్కారు. మూడో రోజు ఆరంభంలోనే వికెట్లు తీసిన శ్రీలంక ఏ బౌలర్లను విసిగించిన ఈ ద్వయం స్కోర్ నాలుగొందలు దాటించింది. షేక్ రషీద్(45) కూడా నిలబడడతో ఆట ముగిసే సరికి ఇండియా ఏ 8 వికెట్ల నష్టానికి 541 రన్స్ కొట్టింది.శ్రీలంక పర్యటనలో భారత -ఏ జట్టు గర్వించదగ్గ ప్రదర్శన చేస్తోంది. రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లోనూ బ్యాటర్లు రెచ్చిపోవడంతో ఐదొందలు కొట్టిన ఇండియా-ఏ స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. రెండో రోజు లంక ఏ బౌలర్లను బెంబేలెత్తిస్తూ వరసగా రెండో శతకం బాదిన ఓపెనర్ సాయి సుదర్శన్(168) మూడో రోజు దంచాడు. కానీ, దేవ్‌దత్ పడిక్కల్(94) ఓవర్‌నైట్ స్కోర్ వద్దే వెనుదిరిగి సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం రుతురాజ్ గైక్వాడ్(13) రిటైర్డ్ హర్టవ్వగా.. ధ్రువ్ జురెల్(53) జతగా సాయి ఇన్నింగ్స్ నిర్మించాడు. జోరుమీదున్న సాయిని డిల్షాం సుదీరా బౌల్డ్ చేసి లంకకు ఉపశమనమిచ్చాడు. కానీ, ఆ తర్వాత సరాన్ష్ జైన్(68 నాటౌట్)తో క్రీజునంటుకున్న జురెల్ అర్ధ శతకంతో చెలరేగాడు. వీరిద్దరూ ఆతిథ్య బౌలర్లను కాచుకొని స్కోర్ నాలుగొందలు దాటించారు. కేశర నువంత(4-158) ధాటికి ఆఖర్లో వరసగా వికెట్లు పడినా.. షేక్ రషీద్(45), అకీబ్ నబీ(30)లు గొప్పగా ఆడారు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి ఇండియా-ఏ 8 వికెట్ల నష్టానికి 541 పరుగులు చేసిన భారత్.. 171 రన్స్ ఆధిక్యంలో నిలిచింది.



**బ్రార్, జైన్ దెబ్బకు..**

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత -ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఏను గొప్పగా కట్టి చేసింది. కెప్టెన్ సహన్ అరాచ్చిగా(127) శతకం బాదినా.. మిగతా బ్యాటర్లు తేలిపోయారు. గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ నాలుగేసి వికెట్లు తీయగా.. లంక నాలుగ్గొందలలోపే పరిమితమైంది. బ్రార్, జైన్ ధాటికి ఆతిథ్య లంక 366 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్ రెండు వికెట్లతో రాణించాడు.

## ఇదే నీకు లాస్ట్ సిరీస్

## రా బ్యాడ్ లక్కోడా..

**-ఇకపై భారత జట్టులో చోటు కష్టమే..?**



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ భవితవ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వరుసగా ఫ్లాప్ ప్రదర్శనలతో సతమతమవుతున్న శాంసన్‌కు ఈ సిరీస్ చివరి అవకాశం కానుందని, ఇందులో విఫలమైతే అంతర్జాతీయ కెరీర్‌కు తెరపడినట్లేనని క్రీడా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

**లగతార్ ఫ్లాప్ ప్రదర్శనలు.. అభిమానుల్లో పెరిగిన నిరాశ..**

భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో తీవ్రంగా శ్రమిస్తోంది. అయితే, జట్టు విజయాల కంటే ఇప్పుడు అందరి దృష్టి సంజూ శాంసన్ ఫామ్‌పైనే ఉంది. కొంతకాలంగా శాంసన్ బ్యాట్ నుంచి చెప్పుకోదగ్గ పరుగులు రావడం లేదు. అంతకుముందు జరిగిన ఐర్లాండ్ పర్యటనలో కేవలం 5 పరుగులకే పరిమితమైన శాంసన్, ఆ తర్వాత ఇంగ్లాండ్ సిరీస్‌లోనూ క్రీజులోకి వచ్చిన కాసేపటికే 1 పరుగు చేసి అవుటయ్యాడు. ఈ వైఫల్యం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత 10 ఇన్నింగ్స్‌ల్లో 357 పరుగులు చేసినప్పటికీ, ప్రస్తుత క్లిష్ట సమయాల్లో కీలక ఇన్నింగ్స్ ఆడలేకపోవడం అతడి స్థానాన్ని ప్రశ్నార్థకం చేసింది.

**సంజూ శాంసన్ వైఫల్యం.. యువ సంచలనానికి వరంగా మారుతుందా?**

మరోవైపు, సంజూ శాంసన్ వరుసగా వైఫల్యాలు చెందుతున్నప్పటికీ మేనేజ్మెంట్ అతడికి వరుస అవకాశాలు ఇస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాంసన్ జట్టులో కొనసాగడం వల్లే ఐపీఎల్ 2026 టాప్ స్కోరర్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లోనూ పరుగుల వరద పారించిన వైభవ్ లాంటి యువ రక్తాన్ని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఒకవేళ ఇంగ్లాండ్ సిరీస్‌లోనూ సంజూ తన ఫామ్‌ను నిలబెట్టుకోలేకపోతే, మేనేజ్మెంట్ కఠిన నిర్ణయం తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# పెద్ది ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..

## -రామ్ చరణ్ బ్లాక్‌బస్టర్ డిజిటల్ స్ట్రీమింగ్ ఎప్పటి నుండి అంటే..!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'పెద్ది' ఓటీటీ విడుదల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ శుభవార్త చెప్పారు. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుందితెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటించి తన నటనతో ప్రశంసలు అందుకుంది. అలాగే దివ్యేందు, బొమన్ ఇరానీ, జగపతిబాబు, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో మెప్పించారు. ప్రతి పాత్ర కథకు బలం చేకూర్చేలా దర్శకుడు తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్స్, సంగీతం, ఎమోషనల్ కథనం కలిసి 'పెద్ది'ని ఈ ఏడాది అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలబెట్టాయి.థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో కూడా అదే స్థాయి ఆదరణ దక్కించుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## కంటి చూపుతో చంపేస్తున్న గ్లామర్ క్వీన్!


# రచ్చ గెలిచేందుకు రంగం సిద్ధం



అంబాజీపేట మ్యారేజి బ్యాండు, లిటిల్ హార్ట్స్ చిత్రాలతో యువతరం మనసులు దోచింది తెలంగాణ ముద్దుగుమ్మ శివానీ నాగారం. ఇంట ఎట్లాగూ గెలిచింది. ఇక రచ్చ గెలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నది ఈ అందాలభామ. తమిళంలో టూరిస్ట్ ఫ్యామిలీ, విత్ లవ్ చిత్రాల ద్వారా అటు నటుడిగా, ఇటు దర్శకుడిగా కూడా గుర్తింపు తెచ్చుకున్న అభిషేక్ జీవంత్ హీరోగా, గౌతమ్ శివరామ్ దర్శకత్వంలో తమిళంలో రూపొందుతున్న చిత్రంలో శివానీ నాగారం కథానాయికగా ఎంపికైంది. యోగలక్ష్మి ఇందులో మరో కథానాయికడ్రామా కంపెనీ సమర్పణలో ఎ.బాలమురుగన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించిన ఓ వీడియోను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'తమిళంలో నేను చేస్తున్న తొలి సినిమా ఇది. నాకు చాలా ప్రత్యేకం. అభిషేక్‌తో కలిసి నటిస్తున్నందుకు ఆనందంగా ఉంది. తనెంతో ప్రతిభావంతుడు. ఇక శివరాజ్‌కుమార్‌సార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడమే గొప్ప వరం' అంటూ ఆ వీడియోలో శివానీ నాగారం పేర్కొన్నది. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానున్నది.


# ప్రెగ్నెన్సీలోనూ ఫుల్ బిజీగా సమంత..

## కొత్త టాక్ షోతో ఓటీటీలో సందడి చేయనున్న స్టార్ హీరోయిన్?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత జీవితంలో 2026 సంవత్సరం ఎంతో ప్రత్యేకంగా మారింది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా వరుస సంతోషాలను ఆస్వాదిస్తున్న ఆమె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబర్‌లో దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న సమంత, ఈ ఏడాది విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుంది. అదే సమయంలో ఆమె గర్భవతి అనే శుభవార్త కూడా అభిమానులతో పంచుకుంది. ప్రెగ్నెన్సీ కారణంగా సమంత కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటారని అభిమానులు భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం ఆమె మరో కొత్త ప్రాజెక్ట్‌తో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.సమంత మరోసారి హోస్ట్‌గా మారనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రముఖ ఓటీటీ వేదిక కోసం చేసిన 'సామ్ జామ్' టాక్ షో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినీ ప్రముఖులతో సమంత జరిపిన ఆసక్తికర సంభాషణలు ఆ షోకు మంచి ఆదరణ తీసుకొచ్చాయి. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీలివ్ తమిళ్ కోసం సమంత ఓ ప్రత్యేక టాక్ షో చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా సోనీలివ్ తమిళ్ తమ సోషల్ మీడియా ఖాతాలో "సమంతతో కలిసి ఓ స్పెషల్ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అంటూ చేసిన పోస్ట్‌ను సమంత కూడా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేయడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఈ టాక్ షో ప్రధానంగా తమిళ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందనున్నట్లు సమాచారం. ఇందులో సమంత తమిళంతో పాటు ఇంగ్లీష్‌లో కూడా సెలబ్రిటీలతో సరదాగా ముచ్చటించనున్నట్లు తెలుస్తోంది. ఆమె హోస్టింగ్ స్టైల్‌కు ఇప్పటికే మంచి గుర్తింపు ఉండటంతో, ఈ కొత్త షోపై కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం సమంత గర్భవతిగా ఉండటంతో భారీ యాక్షన్ సన్నివేశాలు, డ్యాన్స్‌లు లేదా దీర్ఘకాలిక షూటింగ్‌లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ శారీరక శ్రమ అవసరం లేని టాక్ షో చేయడం ఆమెకు అనుకూలంగా ఉంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. టాక్ షో ఫార్మాట్‌లో ఎక్కువగా కూర్చుని సంభాషణలు సాగుతాయి కాబట్టి, ప్రెగ్నెన్సీ సమయంలో కూడా ఈ తరహా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అయితే ఈ టాక్ షో ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

# మంచు విష్ణు ఊహించని నిర్ణయం.. యూట్యూబ్‌లోకి కన్నప్ప




హీరో మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా నిర్మించి, ప్రధాన పాత్రలో నటించిన కన్నప్ప మరోసారి వార్తల్లో నిలిచింది. థియేటర్లలో విడుదలైన తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తుండగా, ఈ చిత్రాన్ని నేరుగా యూట్యూబ్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించింది. గత ఏడాది జూన్ 27న విడుదలైన 'కన్నప్ప' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ అందుకున్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. తొలుత సెప్టెంబర్ 4 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ ప్రారంభమవుతుందని ప్రకటించినా, అనివార్య కారణాలతో విడుదల వాయిదా పడింది.ప్రస్తుతం హిందీ వెర్షన్ మాత్రమే అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి అందుబాటులో ఉండగా, తెలుగు సహా ఇతర దక్షిణాది భాషల్లో సినిమా విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో మంచు విష్ణు తన సొంత యూట్యూబ్ ఛానెల్ అవా ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా 'కన్నప్ప'ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. జూలై 3 నుంచి ఈ చిత్రం యూట్యూబ్‌లో స్ట్రీమింగ్ కానుందని ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను పక్కనబెట్టి నేరుగా యూట్యూబ్‌లో సినిమాను విడుదల చేయడం అరుదైన నిర్ణయమని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఎక్కువ మంది ప్రేక్షకులకు సినిమా చేరువ కావాలనే ఉద్దేశంతో మంచు విష్ణు ఈ నిర్ణయం తీసుకున్నారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్తో పాటు ప్రభాస్, మోహన్‌లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో తిన్నడు పాత్రలో మంచు విష్ణు కనిపిస్తారు. చిన్ననాటి సంఘటనలతో నాస్తికుడిగా మారిన తిన్నడు, తన గ్రామ ప్రజలకు అండగా నిలిచే ధైర్యవంతుడిగా ఎదుగుతాడు. కొన్ని పరిణామాల కారణంగా గ్రామం నుంచి బహిష్కరణకు గురైన అతడు, తన ప్రేయసి నెమలి పాత్రలో నటించిన ప్రీతి ముకుందన్తో కలిసి కొత్త ప్రయాణం మొదలుపెడతాడు.ఈ ప్రయాణంలో తిన్నడు పరమశివుడిపై ఎలా అపార భక్తిని పెంచుకున్నాడు? రుద్ర అనే పాత్రతో అతడి జీవితానికి ఉన్న సంబంధం ఏమిటి? చివరకు అతడు 'కన్నప్ప'గా ఎలా నిలిచాడు? అనే అంశాల చుట్టూ కథ సాగుతుంది. ఇప్పుడు యూట్యూబ్ స్ట్రీమింగ్‌తో ఈ భక్తి ప్రధాన చిత్రం మరింత మంది ప్రేక్షకులను చేరుకోనుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com